క్లుప్తంగా

పెద్దమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి అభిషేకాలు, హారతులు పట్టారు. అమ్మవారి దర్శనార్థం స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి.

సిద్ధేశ్వరం ఉద్యమానికి సీపీఐ మద్దతు

నంద్యాల(న్యూటౌన్): సిద్దేశ్వరం శాశ్వత పరిష్కారానికి అలుగు నిర్మాణం చేపట్టాలని చేస్తున్న ఉద్యమానికి సీపీఐ నంద్యాల జిల్లా విభాగం మద్దతు ఇస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, బాబాఫక్రుద్దీన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమ ఉద్యమ నేపథ్యంలో అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. సోమవారం చేపడుతున్న సిద్ధేశ్వరం అలుగు 8వ వార్షికోత్సవంలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మురుగు నీరు నిల్వ చేరనీయొద్దు



నడిగడ్డలో చెత్తను తొలగించాలని సూచిస్తున్న మున్సిపల్ కమిషనర్

నంద్యాల(సిటీ): పట్టణంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి శానిటేషన్ అధికారులను ఆదేశించారు. ఆదివారం 3, 4, 5 వార్డులను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ పురపాలక పరిధిలోని ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. నిల్వ నీటిలో దోమలకు ఆవాసరంగా మారి ప్రజారోగ్యానికి ముప్పుగా పరిణమిస్తాయని చెప్పారు. సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

మహానందీశ్వరుడికి అభిషేకార్చనలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు స్వామి, అమ్మవార్లకు రుద్రాభిషేకం, కుంకుమార్చనలు చేపట్టారు. స్థానిక యాగశాలలో స్వామి, అమ్మవార్లకు నిత్య కల్యాణోత్సవం నిర్వహించగా.. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా వీక్షించి స్వామివారి అనుగ్రహం పొందారు.

రేపు యల్లమాంబేశ్వరి ఆరాధనోత్సవం



శ్రీయల్లమాంభేశ్వరి మూల విరాట్

డోన్ టౌన్ : పట్టణంలోని కొండపేటలో వెలసిన శాంభవి రేణుక యల్లమాంబేశ్వరి దేవి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆరాధనోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త ఏఈ నాగరాజు ఆదివారం తెలిపారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, బోనాల సమర్పణ,అఖండ జ్యోతి, మంగళ హారతులు,తీర్థ ప్రసాదాల వితరణ, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు. సాయంత్రం రామచంద్ర మాలిక్ బాబా భజన మండలి, వెంకటనాయునిపల్లె శివరామాంజనేయ భజన మండలి, దుర్గపల్లి శ్రీపెద్దమ్మతల్లి భజన మండలి సంయుక్తంగా భజన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా కళాకారుడు కురుకుందు వెంకటరమణచే పాటల కచేరి ఏర్పాటు చేశామన్నారు. వార్షికోత్సవాలకు శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవాలయం ప్రధాన ఉపాసకులు కట్టకాటి ఉదయ నరసింహరాజు నాయుడు హాజరవుతారని వివరించారు.





జూలేపల్లె వద్ద ట్రాక్టర్ ద్వారా సేద్యం చేస్తున్న దృశ్యం, గోస్పాడు వద్ద జొన్న కొయ్యలను తొలగిస్తున్న టిల్లర్



రుద్రవరం మండలం ముకుందాపురం వద్ద వరి గడ్డిని కట్టలుగా చుడుతున్న యంత్రం

సాగుకు యంత్ర సాయం

- వ్యవసాయ పనుల్లో పెరిగిన యంత్రాల వినియోగం
- వరిపైరులో మొదటి నుంచి పూర్తయ్యే దాకా వాటితోనే అధిక పనులు
- ఆధునిక వ్యవసాయం వైపు అన్నదాతల ఆసక్తి

గోస్పాడు: కొన్నేళ్ల క్రితం వ్యవసాయం శారీరక శ్రమ ఆధారంగా నడిచింది. ప్రస్తుతం ప్రతి విభాగంలో యంత్ర, పరికరాల వినియోగం పెరగడం, సాంకేతికత విస్తరిస్తుండటంతో వ్యవసాయంలోనూ నూతన ఆవిష్కరణలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా చేతి కష్టం తగ్గించేలా యంత్రాలు అందుబాటులోకి రావడంతో వాటి వినియోగానికి అన్నదాతలు మక్కువ చూపుతున్నారు. సమయం, శ్రమ, ఖర్చు తక్కువ అవుతుండటంతో వాటితోనే పనులు చేయించుకుంటున్నారు.

పెరిగిన వినియోగం..

ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో భాగంగా ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలు మార్కెట్లో అందుబాటులో ఉంటుండటంతో రైతులకు సాగులో యంత్రాలు అండగా నిలుస్తున్నాయి. వరి పంట సాగులో వీటి వినియోగం మరింత అధికం. ఇటీవల వరిసాగులో యంత్రాలకు ప్రాధాన్యత పెరిగింది. కూలీల కొరత కారణంగా రైతులు దాదాపు 95 శాతానికి పైగా వంటను యంత్రాలతోనే కోయిస్తున్నారు. భూమిని దమ్ము చేయడం దగ్గరి నుంచి నాట్లు వేయడం, పురుగు మందుల పిచికారీ, పంట నూర్పిడి వరకు యంత్రాలనే ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు వరి పంటను యంత్రాలతో కోసి, పొలాల్లో వదిలేసిన గడ్డిని కట్టలు కట్టడానికి సైతం యంత్రాలనే వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీపై యంత్రాలను అందజేయడంతో గ్రామాల్లోని రైతులు కమిటీలుగా ఏర్పడి వివిధ యంత్రాలను కొనుగోలు చేశారు.



జిల్లెల్ల సమీపంలో వరి పైరును మిషన్ ద్వారా కోత కోస్తున్న దృశ్యం (ఫైల్)

పని సులువుగా..

వ్యవసాయంలో యంత్రాలను ఉపయోగించడం వల్ల సాగులో రైతులకు శారీరక శ్రమ తగ్గింది. ముఖ్యంగా వరికోతలు, నాట్ల సమయంలో కూలీల కొరత వేధిస్తుంది. అలాగే ఆయా పనులకు కూలీలు అధికంగా డిమాండ్ చేస్తుండటంతో యంత్రాల వినియోగానికే వారు మొగ్గు చూపుతున్నారు. మెషిన్‌తో వరి కోతలు కోస్తే గడ్డి పశువులకు దాణాగా ఉపయోగపడదని రైతులు భావించే వారు. దీంతో గడ్డిని చేలల్లో వది లేసే వారు. కానీ అది కేవలం అపోహ అని, ఆ గడ్డిలోనూ పోషకాలు ఉంటాయని, పైగా చిన్న ముక్కలుగా తెగిన గడ్డి పశువులకు త్వరగా జీర్ణమవుతుందని పశుసంవర్ధక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. దీంతో రైతులు ప్రత్యేక యంత్రాల సాయంతో ఆ గడ్డిని కట్టలు కట్టించి, పశువుల దాణాగా ఉపయోగిస్తున్నారు. యంత్రాలు అన్ని పనుల్లో రైతులకు చేదోడుగా మారాయి.



కొత్తపల్లి మండలం బండినాయనిపాలెం వద్ద డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న దృశ్యం

యంత్రాలు తప్పనిసరి అయ్యాయి



ఇప్పుడున్న తరంలో వ్యవసాయ పనులు చేయాలంటే తప్పనిసరిగా యంత్రాల అవసరం ఎంతో ఉంది. దుక్కి దున్నే దగ్గర నుంచి సాలు, విత్తనాలు, అరటి బోదలు వేయడం, మందులు పిచికారీ వరకు యంత్రాలనే ఉపయోగిస్తున్నాం. వ్యవసాయ కూలీలతో రెండు, మూడు రోజుల్లో చేసే పనిని యంత్రాలతో ఒక్కరోజులో పూర్తవుతోంది. ఒక్కోసారి కూలీలు కూడా దొరకడం లేదు. కలుపు తీసేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నాం. చివరకు కలుపు తీసేందుకు కూడా యంత్రాలను వినియోగిస్తున్నాం.

– కృష్ణారెడ్డి, రైతు జూలేపల్లె, గోస్పాడు

అవగాహన పెరిగింది



గతంలో వరిగడ్డి కోశాక రైతులు ఎంతో ఇబ్బందులు పడేవారు. గడ్డిని కట్టలుగా చుట్టే యంత్రాలు లేని సమయంలో ఎండుగడ్డి వృథా అయ్యేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా గడ్డిని బెయిలింగ్ చేసే యంత్రాలు రావడం చాలా ఉపయోగకరంగా ఉంది. పశువులకు గడ్డి కొరత తీరింది. చాలామంది రైతులు అవగాహన పెంచుకున్నారు. పశువులకు మేత కొరత లేకుండా చూసుకుంటున్నారు.

– కిశోర్‌కుమార్‌రెడ్డి, పశువైద్యాధికారి, గోస్పాడు

మోటార్ సైకిళ్లు ఢీ..ఒకరికి తీవ్ర గాయాలు

రుద్రవరం: మండలంలోని ఆర్.నాగులవరం గ్రామ సమీపంలో ఆదివారం రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఒకరు తీవ్రగా గాయపడ్డారు. వెల్దుర్తి మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన మనోజ్ రుద్రవరం మండలంలోని ఆలమూరులో ఉన్న బంధువుల ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. ఆర్.నాగులవరం సమీపంలో వెళ్తుండగా ఎదురుగా మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై రుద్రవరం వైపు వెళ్తుండగా అదుపు తప్పి రెండు బైక్‌లు ఎదురుగా ఢీ కొన్నాయి. దీంతో మనోజ్‌కు తీవ్ర గాయాలు కాగా..వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

కేసీ కాల్వలో వర్షపు నీటి ప్రవాహం



కేసీ కాల్వలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

జూపాడుబంగ్లా: కేసీ కాల్వలో వర్షం నీటి ప్రవాహాన్ని చూసిన ఆయకట్టు రైతులు కాల్వకు నీటిని విడుదల చేశారా అంటూ ఆరా తీయసాగారు. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గార్గేయపురం చెరువు నీటితో పాటు వాగులు, వంకల్లోని నీటిని అధికారులు కేసీ కాల్వలోకి మళ్లించారు. దీంతో కేసీ కాల్వలో వర్షపు నీటి ప్రవాహం ప్రారంభం అయినట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కేసీ కాల్వ ఎగువన ఉన్న తుంగభద్ర డ్యాం నిండి సుంకేసుల డ్యాంలోకి నీటి ప్రవాహం కొనసాగితేనే కర్నూలు–కడప కాల్వకు సాగునీటిని విడుదల చేసే అవకాశం ఉందన్నారు. గతేడాది ఆగస్టు మొదటి వారంలో కేసీ కాల్వకు సాగునీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది ముందస్తుగా వర్షాలు కురుస్తున్నందున ముందుగానే వచ్చే అవకాశాలున్నాయన్నారు.

అ'పూర్వ' కలయిక.. ఆనంద డోలిక



ఆళ్లగడ్డలో సమావేశమైన పూర్వ విద్యార్థులు

ఆళ్లగడ్డ: వారంతా ఒకే కళాశాలలో విద్యాభ్యాసం చేశారు. ఆ తరువాత వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. 35 ఏళ్ల తరువాత మళ్లీ ఒకేచోట చేరారు. పాత జ్ఞానపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. స్థానిక ఎస్‌ఏఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో 1987–1990 బీఎస్సీ డిగ్రీ బ్యాచ్‌కు చెందిన పూర్వవిద్యార్థులు ఆదివారం పట్టణంలోని మహాలక్ష్మీ ఫంక్షన్ హాలులో సమావేశమయ్యారు. కుశల ప్రశ్నలతో సంతోషంగా గడిపారు. పాతరోజులను నెమరు వేసుకున్నారు. కొందరు కుటుంబ సమేతంగా పాత స్నేహితులను కలిసేందుకు ఆళ్లగడ్డకు వచ్చారు. అందరూ కలిసి మరోసారి గ్రూప్ ఫోటో దిగారు. అనంతరం పాత జ్ఞాపకాలకు గుర్తుగా వివిధ ఆటల్లో పోటీపడ్డారు. విజయం సాధించిన వారికి వివిధ రకాల బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు. కాగా ఈ కలయికకు ఏడాది కాలంగా కొందరు పూర్వ విద్యార్థులు శ్రమించారు.

40 సంవత్సరాల తరువాత..

చాగలమర్రి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 1983–1984లో 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు 40 సంవత్సరాల తరువాత ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో కలుసుకున్నారు. వివిధ ప్రాంతాలలో స్థిరపడిన సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.నాటి జ్ఞాపకాలను గుర్తుకు చేసుకొని సంతోషంగా, ఉల్లాసంగా గడిపారు. అనంతరం విందు భోజనం ఆరగించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తోటి పూర్వ విద్యార్థి ఎస్‌పి మహబూబ్ బాషాకు సంతాపం తెలిపారు. పూర్వ విద్యార్థులు వైఎస్సార్ సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, బుచ్చు సుబ్రహ్మణ్యం, ఖాశింపీరా, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వి.లక్ష్మణబాబు, సయ్యద్ ఇజాజుద్దీన్, అనురాధ, రామసుబ్బయ్య, షరీఫ్, మౌళాళి, నరసింహుడు, సత్యనారాయణ, వీఆర్‌ఓ ఓబులేసు పాల్గొన్నారు.



చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



క్రిష్టిపాడు వద్ద నిండుగా ప్రవహిస్తున్న కుందూ నది

కుందూలో తగ్గని నీటి ఉధృతి

దొర్నిపాడు: కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో వర్షపు నీటితో కుందూ నదిలో వరద ఉధృతి కొనసాగుతోంది. పది రోజులుగా నదిలో వరద ప్రవాహం తగ్గడం లేదు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో ఆ నీరు నదికి చేరుతోంది. ఇన్నాళ్లుగా ఒట్టి పోయిన నది ప్రస్తుతం నిండుగా ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు ఉత్సాహంగా తిలకిస్తున్నారు.

మహానందిలో సండే సందడి

మహానంది: మహానంది ఆలయంలో భక్తజన సందడి కొనసాగుతుంది. ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు రుద్రగుండం, బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఉచిత, ఆర్జిత సేవా టికెట్లు, మహదాశీర్వచనం, అభిషేకం సేవల ద్వారా దర్శనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న నవనంది క్షేత్రాలైన వినాయకనంది, గరుడనంది ఆలయాలను భక్తులకు సందర్శించి పూజలు చేపట్టారు.

ఓంకారంలో భక్తుల రద్దీ

ఓంకారం ఆలయంలో భక్తులసందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు అవడంతో వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తులు శ్రీ గంగ, ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామి, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకుని శ్రీ వెంకటేశ్వరస్వామి వారిని దర్శించారు. స్థానిక కాశిరెడ్డినాయన అన్నప్రసాద వితరణ కేంద్రం వద్ద భక్తులు అన్న ప్రసాదాలు స్వీకరించారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

మహానందీశ్వరుడి సన్నిధిలో ..



మహానందికి వచ్చిన తెలంగాణ ఎమ్మెల్యే విజయరావు, కుటుంబ సభ్యులు



వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న డీఆర్‌ఓ లవన్న

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో తెలంగాణ రాష్ట్రం, పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు విజయరామారావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు నెల్లూరు జిల్లా డీఆర్‌ఓ, శ్రీశైలం ఈఓగా పనిచేసిన ఎస్.లవన్న మహానందికి వచ్చారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి స్వాగతం పలికారు. వారు స్వామి, అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. వేదపండితులు స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు.

ఇస్కాన్‌లో భగవద్గీత తరగతులు



ప్రత్యేక అలంకారంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర

కర్నూలు కల్చరల్: నగరంలోని భగీరథ కాంప్లెక్స్‌లో వెలసిన పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి దర్శనం కల్పించారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞం నిర్వహించారు. హరినామ సంకీర్తనలతో నృత్యాలు చేశారు. భక్త ప్రహ్లాద స్కూల్ విద్యార్థులచే నృసింహ, భక్త ధ్రువ నాటికల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక ప్రభు సందేశమిచ్చారు. భగవద్గీత జీవితంలోని ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతుందన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కరాటే సాధనతో శారీరక దృఢత్వం



పోటీలను ప్రారంభిస్తున్న మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ శమంతకమణి

కర్నూలు (టౌన్) : కరాటే సాధన వల్ల విద్యార్థినీ, విద్యార్థులకు మానసిక వికాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని మాజీ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ శమంతకమణి అన్నారు. ఆదివారం స్థానిక యునైటెడ్ క్లబ్ హాలులో అంతర్ జిల్లా కరాటే పోటీలను నిర్వహించారు. గ్రాండ్ మాస్టర్ ఆరిఫ్ హుస్సేన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు తమ దైనందిన జీవితంలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. చదువుతో ఒత్తిడికి గురయ్యే విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ వంటి క్రీడల్లో రాణించాలన్నారు. తమ వంతుగా క్రీడాభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సయ్యద్ ఖలీద్, మాజీ డీఎస్పీ హుస్సేన్ పీరా పాల్గొన్నారు.

8వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయండి

కొత్తపల్లి: సంగమేశ్వరం వద్ద సోమవారం జరిగే సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8 వ వార్షికోత్సవాన్ని ప్రజలు, రైతులు పాల్గొని విజయవంతం చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. అలుగు నిర్మాణానికి శంకుస్థాపన చేసి 8 ఏళ్ల అవుతున్న సందర్భంగా వార్షికోత్సవం నిర్వహిస్తున్నామన్నారు.

నంద్యాలలో భారీ వర్షం

- జమలయమైన రహదారులు



వీధుల్లో కాల్వలు నిండి రోడ్లపైకి వచ్చిన మురుగునీరు

నంద్యాల(అర్బన్): పట్టణంలో ఆదివారం సాయంత్రం నుంచి 2గంటల పాటు భారీ వర్షం కురిసింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదివారం కురిసిన వర్షం తోడవటంతో పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రెండు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించి పోయింది. మురుగుకాల్వలు నిండి రహదారులపై ప్రవహించడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వర్షాలు ఇలాగే కురిస్తే పొలాల్లో పిచ్చిమొక్కలు పెరిగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



వర్షం కురుస్తున్న దృశ్యం



ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వర్షపునీరు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల– బనగానపల్లె ఆర్అండ్‌బీ రహదారిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. బనగానపల్లె నుంచి కోవెలకుంట్లకు ప్రయాణికులతో వస్తున్న ఆటో అమడాల మెట్ట సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగుకు చెందిన ఉసేన్‌పీరా అనే వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రునికి స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.